క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పినతాడివాడలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ లవరాజు

డెంకాడ: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ లవరాజు ఆదేశించారు. మండలంలోని పినతాడివాడ, అమకాం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రక్షిత మంచినీటి ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయించాలని సిబ్బందికి సూచించారు. మురుగుకాలువల్లో పూడికలు తొలగించాలని, మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



వీధి దీపాల నిర్వహణపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగరంలో వీధి దీపాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సిబ్బందిని ఆదేశించారు. ఐడీఎస్ఎంటీ కాంప్లెక్స్ కార్యాలయంలో ఉన్న విద్యుత్ సామగ్రిని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజలు, కార్పొరేటర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా తగిన సామాగ్రి సిద్ధంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని బాగుచేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నెల్లిమర్ల: నెల్లిమర్లలో రోటరీ క్లబ్ తాగునీటి సేవలు ప్రారంభించింది. స్థానిక మిమ్స్ ఆస్పత్రి ఎదురుగా ఇస్కాన్ స్థలంలో విజయనగరం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణకాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను నితాని సేవని మాతాజీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాదచారులు, వాహనచోదకుల దాహార్తి తీర్చేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎం.పద్మకుమారి, మేఘరాజ్‌రాతీ, భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 64 మంది ఎంపిక



వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. తిరుపతికి చెందిన శ్రీధర్ ఆచార్య ఆర్థిక సహాయంతో స్పందన అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వైద్యులు రోగుల కళ్లను తనిఖీ చేశారు. మొత్తం 130 మంది హాజరు కాగా వారిలో పలు కంటి సమస్యలతో బాధపడుతున్న 64 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ జ్యోతి, బెవర ఈశ్వరరావు, గణపతి, తూముల యోగేంద్ర, ముంజి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: ప్రైవేటు విద్యాసంస్థల్లో జరుగుతున్న అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. పట్టణంలోని పలు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల చదువుకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ధనుంజయ సురేష్, సూర్యనారాయణ, సంతోష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం



కరపత్రాలు విడుదల చేస్తున్న యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అప్పలనాయుడు, తదితరులు

చీపురుపల్లి: ప్రభుత్వ బడిని రక్షించుకోవాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం– ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' అనే కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉన్న సదుపాయాలు, విద్యా బోధన తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. తల్లిదండ్రులకు విశ్వాసం కలిగించేలా ఊరి పిల్లలు అందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మండల యూటీఎఫ్ ప్రతినిధులు గొర్లె పద్మావతి, దువ్వాడ కృష్ణమూర్తి, చింత రామకృష్ణ, భోగి జయరాం, మన్నెపురి సత్యనారాయణ, యలకల వెంకటరమణ, యు.వినోద్, ఎం.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

వేపాడ: బడి ఈడు పిల్లలు అంతా బడిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఉపాధ్యాయులు అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బొద్దాం, సోంపురంలో ఆయా గ్రామాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, సీఆర్పీలు, విద్యార్థులు మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పనిలో పెట్టడం నేరమన్నారు. బడిలో చేరని, చదువు మధ్యలో ఆపేసిన 6 నుంచి 14ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వబడుల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్నం భోజనం అందిజేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు, పెద్దలు సహకరించి బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు.



వేపాడ: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బొద్దాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వేపాడ: సోంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు 'భవిత'

గజపతినగరం: ప్రత్యేక అవసరాల పిల్లల బంగారు భవిష్యత్‌కు భవిత కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయని స్థానిక భవిత కేంద్రం ఐఈఆర్టీలు శ్రీనివాసరావు, సత్యనారా యణ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో పలువురు ప్రత్యేక అవసరాల చిన్నారులకు మంగళవారం అడ్మిషన్‌లు కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు, బధిరులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఎంఈఓ ఆదేశాలతో ఇప్పటికే మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే చేశామని, ప్రస్తుతం 20 మంది పిల్లలు ఇక్కడి భవిత కేంద్రంలో ఉన్నారని చెప్పారు.



గజపతినగరం: భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థి, తల్లికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఐఈఆర్టీలు

రక్తం కొరత లేని సమాజాన్ని నిర్మిద్దాం..



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం: రక్త సంబంధీకుల కన్న అత్యవసర పరిస్థితిలో రక్తం ఇచ్చి ఆదుకున్న రక్తదాతలే మిన్న అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. నగరంలోని ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్‌లో నీడ్ సొసైటీ ఆధ్వర్యంలో మాతృభూమి సేవా సంఘం విజయనగరం, విశాఖ జిల్లాల కార్యదర్శులు గోపాలరావు, సుధీర్‌ల నేతృత్వంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ.. ఎటువంటి సందర్భాలు అయినా అందరూ రక్తదానం చేసి రక్తం కొరత లేని సమాజాన్ని తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన మానవుడు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, యువత ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ నాగేశ్వరరావు, మాతృభూమి సేవ సంఘం ప్రతినిధులు పైడినాయుడు, రాము, సంతోష్, గోవిందరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగే చర్యలను ఉపేక్షించొద్దు



మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏ చర్యలనైనా ఉపేక్షించవద్దని ప్రణాళిక కార్యదర్శులకు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో నగర ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా ప్రణాళిక విభాగానికి సంబంధించి చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రకటన బోర్డుల పన్నులు, ఇతరత్రా పన్నులు రాబట్టడంలో ఉదాసీనంగా వ్యవహరించిన కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో భవన వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రణాళిక కార్యదర్శులు క్షేత్ర పర్యటనలు చేస్తూ వ్యర్థాల తొలగింపునకు చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల రక్షణ చర్యలు చేపట్టామని, కొన్నిచోట్ల మరమ్మతులకు గురైనట్లు గమనించామన్నారు. వాటిని కూడా తక్షణమే పరిరక్షించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే శిథిలావస్థకు చేరుకున్న భవనాలను గుర్తించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మధుసూదనరావు, అమ్మాజీరావు, సర్వేయర్ సింహాచలం, టీపీఎస్ ఫిలిప్, ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే భవిష్యత్ అంధకారం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు యువతకు సూచించారు. స్థానిక ఫోర్ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విచక్షణ కోల్పోయి, మత్తులో హింసాత్మక సంఘటనలకు పాల్పడి, క్రిమినల్ కేసుల్లో నిందితులుగా మారే అవకాశం ఉందన్నారు. మత్తుపదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. విద్యార్థులకు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేసుకునేందుకు కృషిచేయాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబునాయుడు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

వేపాడ: స్థానిక శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆల య ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5: 30 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 9 గంటలకు స్వామివారి కల్యాణం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల వితరణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు ఆపాఠశాల ఉపాధ్యాయులు తమసొంత నిధులతో నోట్ పుస్తకాలు సమ కూర్చారు.హెచ్ఎం ఆర్.శంకరరావు, ఉపాధ్యాయులు జి.నర్సింహమూర్తి, ఎం.సన్యాసయ్య, ఏ.జనార్దన్,టి.రాంబాబు కలిసి రూ.11,600 విలువ చేసే నోట్ పుస్త కాలను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎస్.భీమశంకరరావు

విజయనగరం అర్బన్: జూనియర్ కళాశాలల అధ్యాపకులకు 'కెరియర్ ఎడ్యుకేషన్' అంశంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు మంగళవారం కొనసాగాయి. ప్రభుత్వం, సమగ్ర శిక్ష, మెల్బార్న్ యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో జరుగుతున్న ఈ శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు ఇంటర్మీడియట్ విద్యా మండలి రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ జీఎస్ఆర్ కృష్ణారావు పాల్గొని పలు అంశాలపై అవగాహన కలిగించారు. జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎస్.భీమశంకరరావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వశిక్ష సీఎంఓ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక ప్రవచన కర్త ధవళ సర్వేశ్వరరావును సత్కరిస్తున్న ఆలయ అధికారులు, వేదపండితులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దేవస్థానం పక్కన ఉన్న అమ్మవారి కళావేదికపై ఆధ్యాత్మికవేత్త ధవళ సర్వేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనం ఆద్యాంతం ఆహూతులను ఆకట్టుకుంది. పోతన భాగవతంలోని భక్తప్రహ్లాదలోని పలు అంశాలను వివరించారు. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్యాత్మిక ప్రవచన కర్తను ఘనంగా సత్కరించారు. వేదపండితులు తాతా రాజేష్ వేదాశీస్సులు అందజేశారు. అనంతరం సుంకరపేటకి చెందిన అరవింద గ్రూప్ కోలాట ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలు, సిరిమాను అధిరోహకులు బంటుపల్లి వెంకటరావు, ఆర్.సూర్యపాత్రో, ఎం.రాంబాబు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అంగారక చతుర్థి పూజలు



రాజరాజేశ్వరీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: అంగారక సంకటహర చతుర్థి నేపథ్యంలో దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు,కుంకుమ పూజలు చేశారు.పలువురు భక్తులు ప్రభలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న జేఈ శ్రావణ్‌కుమార్

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని తెలిపారు. రోడ్లు, కాలువల్లో చెత్తాచెదారం తొలగించడంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. క్లోరినేషన్ ఎలా చేపట్టాలన్న దానిని గ్రామీణ తాగునీటి సరఫరాల విభాగం జేఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఎస్.కోటలో భారీ వర్షం



ఎస్.కోట ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

శృంగవరపుకోట: ఎస్.కోటలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం సుమారు గంటన్నర పాటు ఏకదాటిగా కురిసింది. కుమ్మేసిన వానతో ఎస్.కోట పట్టణం సంద్రం అయ్యింది. వర్షపు నీటితో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. వీధుల్లో కాలువలు, రోడ్ల అన్న తేడా లేకుండా వర్షపు నీరు పోటెత్తింది. విశాఖ -అరుకు ప్రధాన రహదారి జలమయం అయ్యింది. మోకాలి లోతున నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. స్కూళ్లు విడిచిపెట్టే సమయం కావడంతో విద్యార్థులు, వారి కోసం వచ్చిన తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు.

పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు విరాళం

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని సుధారాణి అదే పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలను విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావుకు ఆ నగదును మంగళవారం అందించారు. ఈ డబ్బులను పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్(మైక్‌సెట్) కొనుగోలుకు వినియోగిస్తామని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన ఉపాధ్యాయిని సుధారాణిని అందరూ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ మండల రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంకలాంలో క్యాన్సర్ వైద్య శిబిరం



వైద్యురాలిని సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటరావు

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం గ్రామంలో విశాఖకు చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కునుకు వెంకటరావు(నాగరాజు) శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ఉన్న గ్రామంలో క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించిన మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సుమారు 118 మందికి ఆస్పత్రి వైద్యులు సుభద్ర, రమ్య, భావన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులను సర్పంచ్ వెంకటరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి కోఆర్డినేటర్ చిక్కాల స్వాతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శ కళాశాలను సద్వినియోగించుకోండి

- చీపురుపల్లి ఆదర్శ డిగ్రీ కళాశాలలో డిగ్రీతో పాటు పీజీ కోర్సులు
- అధునాతన ల్యాబరేటరీ, వసతి సదుపాయం
- ప్రిన్సిపాల్ కృష్ణాజీ, అధ్యాపకులు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ, అధ్యాపకులు

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో డిగ్రీతో పాటు పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ సూచించారు. కళాశాలలో అందిస్తున్న కోర్సులు, గ్రూపులు, సదు పాయాలు, తదితర అంశాలతో ముద్రించిన వాల్‌పోస్టర్లను కళాశాలలో అధ్యాపకులతో కలిసి మంగళవారం ఆయన విడు దల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నియోజ కవర్గంతో పాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిష్ణాతులైన శాశ్వత అధ్యాపకులతో ఇక్కడ డిగ్రీ, పీజీ కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీ, పీజీ చదువుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేటు కళాశాలలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. తమ కళాశాలలో డిగ్రీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జువాలజీ కోర్సులతో పాటు బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏలో ఎకనామిక్స్ కోర్సులు, అదే విధంగా పీజీలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అధునాతనమైన ల్యాబరేటరీ సౌకర్యంతో పాటు విశాలమైన క్రీడా ప్రాంగణం ఉందన్నారు. దీంతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహసదుపాయం కూడా ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు ఇంత చక్కని అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్ల కోసం 94947 77980 నంబర్‌ను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ జ్వాలాముఖి, డాక్టర్ విజయభారతి, డాక్టర్ మల్లేశ్వరరావు, డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ చంద్రమౌళి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



భూపాలపురంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: రైతులందరికీ వరి విత్తనాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. భూపాలపురం గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, పురు గు మందులు రైతు భరోసా కేంద్రం వద్ద అందుబాటులో ఉంటాయని రైతులకు చెప్పారు. పాలవలస రైతుభరోసా కేంద్రం వద్ద స్థానికుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శీర సత్యం, కోరాడ రామకృష్ణ, తాడ్డి శ్రీనివాసరావు, సుంకరి రమణమూర్తి, గేదెల అప్పలనాయుడు, వీఏఏలు పాల్గొన్నారు.



పాలవలసలో విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు సన్యాసినాయుడు,తదితరులు